క్లుప్తంగా

రామనారాయణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు

విజయనగరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో ఈ నెల 27వ తేదీ నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నారాయణం, సీతారామయ్యలు తెలిపారు. ఇదే విషయమై వారు రూపొందించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని, గణేశుని ఆశీర్వాదం పొందాలని కోరారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారంలో వరుణ్ మోటార్స్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన పలువురు తహసీల్దార్ ఎన్వీ రమణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ, బంజరు భూములను ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డీ–పట్టా భూములు 3.76 సెంట్లు, గయాలు భూమి 1.44 సెంట్లను ఆక్రమించుకోవడం జరిగిందన్నారు. వారి నుంచి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, నిరుపేదలకు అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు జయరాజు, శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దోబీ పోస్టులు భర్తీ చేయాలి

విజయనగరం టౌన్: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు భర్తీ చేయాలని విజయనగరం రజక సంఘం అధ్యక్షుడు కోనాడ పైడిశెట్టి డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. రజకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, ఇళ్లు లేని రజకులకు ఇళ్లు, ఇళ్లస్థలాలు ఇవ్వాలని అలాగే నిర్మాణాలకు ఆర్థికసాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదరణ పథకం ద్వారా దోబీ ఘాట్‌లు ఏర్పాటు ఇవ్వాలన్నారు. చెరువులపై పూర్తి హక్కులు కల్పించాలన్నారు.

హాస్టల్ వార్డెన్‌లతో ఎమ్మెల్యే సమావేశం

డెంకాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలోని బీసీ వసతిగృహాల(హాస్టళ్లు) వార్డెన్‌లతో ఎమ్మెల్యే లోకం నాగమాధవి సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వసతిగృహంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, హాస్టళ్లలో విద్యార్థుల ప్రవేశాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి రాజులమ్మ, ఎంపీడీవో భవాని, డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాల హాస్టళ్ల వార్డెన్లు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం



అర్జీదారుని సమస్య వింటున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ప్రాధాన్యతా క్రమంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని, పలువురు సమర్పించిన అర్జీలు స్వీకరించారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా వినతిపత్రం రూపంలో అధికారంలో సమర్పించాలని ఆయన సూచించారు. ఆ తర్వాత సంబంధిత శాఖ ద్వారా సమస్య పరిష్కరించడం జరుగుతుందన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

చీపురుపల్లి: ఎంతో ఉజ్వల భవిష్యత్ అనుభవించాల్సిన బాలికలకు 18 ఏళ్లలోపు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వుల మేరకు జిల్లా న్యాయమూర్తి ఎం.బబిత ఆదేశాలతో స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వివాహాలు చేస్తే శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ధర్మరాజు, సీఐ జి.శంకరరావు, ఎస్సై ఎల్.దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైల్ తనిఖీ..

అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ పట్టణంలోని సబ్ జైల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసారు. అక్కడున్న ఖైదీలతో మాట్లాడుతూ.. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే సబ్‌జైల్‌లో లీగల్ ఎయిడ్ క్లినిక్స్‌ను పర్యవేక్షించారు.

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకం!



ధ్వంసమైన ముక్కాం నుంచి చేపలకంచేరు వెళ్లే రోడ్డు



గుంతలమయంగా రెడ్డికంచేరు-ముంజేరు రోడ్డు

- అధ్వానంగా గ్రామీణ రోడ్లు
- అడుగుకో గుంత, గజానికో గొయ్యి మాదిరి దారులు
- నరకయాతన అనుభవిస్తున్న ప్రయాణికులు
- రోడ్డు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి



వరదనీటితో అధ్వానంగా చాకివలస గ్రామ రోడ్డు



సవరవిల్లి నుంచి ఎయిర్‌పోర్టు, జమ్మయ్యపేట మీదుగా కవులవాడ వెళ్లే రోడ్డు ఇలా..

భోగాపురం: గ్రామీణ రోడ్లు చాలా అధ్వానంగా తయారయ్యాయి. ఏ దారి చూసినా అడుగుకో గుంత..గజానికో గొయ్యి మాదిరి కనిపిస్తున్నాయి. ఈ తరహా రహదారుల్లో ప్రయాణం చేసేందుకు ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో రోగులను ఆస్పత్రికి తరలించాలంటే ఈ గతుకుల రోడ్లలో వెళ్లాలంటే చుక్కలు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వానలకు మరీ దారుణంగా దారులు తయారవుతున్నాయని, తక్షణమే రోడ్ల మరమ్మతు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇవేనా.. అద్దంలా మెరిసే రోడ్లు?

ఎన్నికల ప్రచార సమయంలో తాము అధికారంలోకి వస్తే అద్దాల్లా మెరిసే రోడ్లు వేసి చూపిస్తామని కూటమి నాయకులు ప్రగల్భాలు పలికారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏ దారి చూసినా ధ్వంసమై కనీసం నడవడానికి కూడా వీలు లేని విధంగా ఉన్నాయని, ప్రభుత్వం ఏర్పడి 14 నెలల కాలం దాటుతోంది..ఎక్కడి రోడ్లు బాగు చేశారని నిలదీస్తున్నారు. సంకాంత్రి పండగ నాటికి కొత్త రోడ్లు వేస్తామన్నారు..ఏవీ ఎక్కడ వేశారని ప్రశ్నిస్తున్నారు.

ఈ రోడ్లలో వెళ్లలేం 'బాబు'!

మండలంలోని ముక్కాం నుంచి తోటపల్లి, బోయపాలెం, ఎర్రముసలయ్యపాలెం మీదుగా చేపలకంచేరు..రెడ్డికంచేరు నుంచి బమ్మిపేట, కొంగవానిపాలెం మీదుగా ముంజేరు..భోగాపురం జాతీయ రహదారి నుంచి కొల్లుపేట మీదుగా చాకివలస.. సవరవిల్లి జాతీయ రహదారి నుంచి ఎయిర్‌పోర్టు, బసవపాలెం, జమ్మయ్యపేట మీదుగా కవులవాడ వెళ్లే రోడ్లన్నీ పాడయ్యాయి. ఈ దారుల్లో వెళ్లాలంటే గ్రామస్తులు భయపడుతున్నారు. ఆయా రోడ్లలో నిత్యం ప్రయాణించే వారంతా ప్రమాదాలకు గురవుతున్నామని, తమ వాహనాలు రిపేర్ అవుతున్నాయని, రోడ్లు గతుకులతో ఒళ్లు హూనమైపోతోందని వాపోతున్నారు. తమ రోడ్డు సమస్యలు పరిష్కారానికి చొరవ తీసుకోవాల్సిన ఎమ్మెల్యే లోకం నాగమాధవి కూడా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా కనీసం రోడ్లలోని గుంతలనైనా పూడ్చివేయాలని కోరుతున్నారు.

మా ఊరికి రోడ్డు వేయండి..



మా ఊరి నుంచి కొల్లుపేట మీదుగా మండల కేంద్రమైన భోగాపురానికి వెళ్లే రోడ్డు గుంతలమయమైంది. వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణిస్తే ఏది గుంతో..ఏది సమతల ప్రదేశమో తెలియడం లేదు. ఒక్కోసారి వరదనీటితో నిండిన గుంతలో దిగి పడిపోయి గాయాలపాలవుతున్నాం. ఎమ్మెల్యే నాగమాధవి గారూ.. కొత్త రోడ్డు వేయండి. కనీసం మరమ్మతులైనా చేయించండి.

– నడుపూరి వెంకటేష్, చాకివలస గ్రామం

దివ్యాంగుల ఆందోళన



మా పింఛన్లు తీసేశారని ఆవేదన వ్యక్తం చేస్తూ పలువురు దివ్యాంగులు పూసపాటిరేగ మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. చింతపల్లికి చెందిన 25 మంది దివ్యాంగుల పింఛన్లను అనర్హత పేరిట తొలగించారని, అధికారులు పునరాలోచన చేసి తమ పింఛన్లు పునరుద్ధరించి అందివ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుల ఆందోళనకు సంఘీభావం తెలుపుతూ వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి బర్రి చిన్నప్పన్న మాట్లాడుతూ అర్హుల పింఛన్లు కావాలనే ప్రభుత్వం తొలగిస్తోందని, మళ్లీ అర్హులైతే సదరం సర్టిఫికెట్ సమర్పించాలని చెప్పడం ఇబ్బంది పెట్టడం కాదా అని నిలదీశారు. తక్షణమే తొలగించిన వారి పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో ఎం.రాధికకు వినతిపత్రం అందజేశారు. – పూసపాటిరేగ

రైతుల నిరసన



అర్హత కలిగినా అన్నదాత సుఖీభవ పథకం అందని పలువురు రైతులు పూసపాటిరేగ మండల వ్యవసాయ కార్యాలయం వద్ద సోమవారం నిరసనకు దిగారు. గోవిందపురం పంచాయతీ, భరిణికాం గ్రామానికి చెందిన రైతులు ఆళ్ల లక్ష్మణ, ఆళ్ల సూర్యనారాయణ, కొణతాల జగన్నాథం, ఆళ్ల చినసూరి, బొచ్చు రామకృష్ణ, జీరు అచ్చప్పుడులతో పాటు గ్రామానికి చెందిన 50 మందికి పైగా రైతులకు పథకం మంజూరు చేయకపోగా, వారంతా ప్రభుత్వం, అధికారుల తీరును నిరసిస్తూ తహసీల్దారు ఎన్వీ రమణకు వినతి పత్రం అందజేశారు. అధికారుల తప్పిదం వల్లే తమకు పథకం మంజూరు కాలేదని, మరోసారి తమ అర్హతలు పరిశీలించి పథకం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. – పూసపాటిరేగ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

విజయనగరం క్రైమ్: మత్తు పదార్థాలతో జీవితం నాశనమవుతుందని, వాటికి దూరంగా ఉండాలని ఈగల్ టీమ్ అధికారి విజయ్‌కుమార్ సూచించారు. నగరంలోని మహారాజా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై సోమవారం అవగాహన కల్పించారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలను తీసుకోవడం వల్ల శరీర అవయవాలు పాడై చనిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా ఉండాలన్నారు.

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ జేటీఎస్ఎం కళాశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ఎస్ఐ గణేష్ సోమవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత ఫ్యాషన్ మాయలో పడి చెడు అలవాట్లుకు బానిసలై తమ బంగారు భవిష్యత్ పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, మద్యం, సిగరెట్, ఖైనీ, పాన్ పరాగ్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

విజయనగరం టౌన్: నగరంలోని కోట జంక్షన్ సహా ఆర్అండ్‌బీ జంక్షన్, రైతుబజారు ప్రాంతాల్లో జిల్లా హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ సోమవారం జరిగింది. ఈ నెల 27న వినాయక చవితి ఉత్సవాలు మొదలు కానుండడంతో పూజలకు మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిస్తూ 4 వేలకు పైగా విగ్రహాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, జిల్లా హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వాసు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, విజయనగరం యూత్ ఫౌండేషన్, విజయదుర్గా ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని పిలుపునిస్తూ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

విజయనగరం గంటస్తంభం: స్థానిక రింగ్‌రోడ్డు సింహాద్రినగర్‌లోని షిర్డీసాయిబాబా ఆలయం వద్ద మట్టి గణపతి విగ్రహాలు సోమవారం పంపిణీ చేశారు.



విజయనగరం టౌన్: విగ్రహాలు పంపిణీ చేస్తున్న దాతలు

నెల్లిమర్ల: మండల కేంద్రంలో జైత్ర కన్‌స్ట్రక్షన్ ఆర్థిక సహకారంతో సమకూర్చిన మట్టి గణేశుని విగ్రహాలను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు చేతులమీదుగా ప్రజలకు సోమవారం అందజేశారు.

భోగాపురం: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద ఎమ్మెల్యే లోకం నాగమాధవి మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



భోగాపురం: ఎరువుల గొడౌన్‌లో తనిఖీలు చేస్తున్న తహసీల్దారు రమణమ్మ



నెల్లిమర్ల: తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నెల్లిమర్ల: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజీ సురేష్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ఎరువుల షాపులను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విక్రయించిన, నిల్వ ఉన్న ఎరువులను రికార్డుల ఆధారంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు విక్రయించొద్దని, కృత్రిమ కొరత సృష్టించవద్దని తెలిపారు. ఆయన వెంట చీపురుపల్లి ఏడీఏ కోటేశ్వరరావు, నెల్లిమర్ల ఏవో శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం, సతివాడ, ఒమ్మి గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో తహసీల్దారు శ్రీకాంత్ సోమవారం తనిఖీలు చేపట్టారు. కావాలని ఎవరైనా ఎరువులు ఉండి కూడా రైతులకు విక్రయించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హెచ్చరించారు.

భోగాపురం: మండలంలోని ఎరువుల దుకాణాలను తహసీల్దారు రమణమ్మ, మండల వ్యవసాయ అధికారి హైమవతి, ఎస్ఐ సూర్యకుమారిలు తనిఖీ చేశారు. ప్రతి రైతుకు డీబీటీ చేసిన తర్వాతే ఎరువులు ఇవ్వాలని, ఏమైనా అవకతవకలకు పాల్పడితే 6ఏ కేసు నమోదు చేసి, లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందన్నారు.

కాలువల్లో చెత్త వేస్తే జరిమానా

విజయనగరం: నగరంలోని కాలువల్లో ఎవరైనా చెత్త వేసినట్లు కనిపిస్తే జరిమానా విధిస్తామని కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి హెచ్చరించారు. రింగ్‌రోడ్డులోని ప్రధాన కాలువల్లో అక్కడి వ్యాపారులు ఇష్టానుసారంగా చెత్త వేయడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు ఆయన అక్కడి కాలువను సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలువల్లో పడేస్తున్న వ్యర్థాలు మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారి ఒకేచోట మురుగు నిల్వ ఉండే పరిస్థితి నెలకొందన్నారు. మురుగునీటి నిల్వలతో స్థానికులు రోగాల బారినపడే అవకాశం ఉందన్నారు. ఎవరూ చెత్తాచెదారం కాలువల్లో వేయవద్దన్నారు.

అంబేడ్కర్ ఆలోచనలు ప్రజలకు చేరాలి



బ్రోచర్ విడుదల చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు


శృంగవరపుకోట: భారతదేశ తొలి న్యాయశాఖ మంత్రిగా ఎనలేని సేవలు అందించిన డాక్టర్ బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలు ప్రజలకు చేరాలని తహసీల్దార్ డి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ప్రచురించిన బ్రోచర్‌ను సోమవారం ఆయన తన కార్యాలయంలో విజ్ఞాన కేంద్రం సభ్యులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో దళిత సంఘ ప్రతినిధులు డోల కేశవ, గుర్రపు శ్రీను, తెరపల్లి కోటరావు, బోనెల ఈశ్వరరావు, తెరపల్లి సూరిబాబు, మెయ్యి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న గణనాథులు

వినాయక చవితి ఉత్సవాలు పురస్కరించుకుని, పలుచోట్ల రూపుదిద్దుకుంటున్న గణనాథుల విగ్రహాలు కనువిందు చేస్తున్నాయి. భారీ కాయంతో వివిధ ఆకారాల్లోని ప్రతిమలు చూసి చూపరులు మంత్రముగ్ధులవుతున్నారు. విజయనగరంలోని కొత్తపేట కుమ్మరి వీధిలో తుదిరూపు సంతరించుకున్న గణేశుని విగ్రహాలను సాక్షి కెమెరా సోమవారం బంధించింది. ఇదిలా ఉంటే ఈ నెల 27న వినాయక చవితి పండగ కావడంతో ఉత్సవ నిర్వాహకులు వీటిని కొనుగోలు చేసేందుకు బారులుతీరారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



బహుబలి అవతారంలో వినాయకుడు



ఆంజనేయస్వామిలా గణేశుడు



ఆంజనేయుడిపై గణనాథుడు



అనంతపద్మనాభస్వామి అవతారంలో గణపతి



అలరిస్తున్న బాల బొజ్జగణపయ్య



శ్రీవేంకటేశ్వరస్వామి అవతారంలో తయారు చేసిన గణపతి విగ్రహం

ఆత్మరక్షణ విద్య అవసరం



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న పోలీసు సిబ్బంది

గుర్ల: విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్య అవసరమని ఎస్సై పి.నారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్ విద్యార్థులకు సోమవారం ఆత్మరక్షణ విద్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు ఈ విద్య ఎంతో అవసరం అవుతుందని చెప్పారు. శిక్షణలో హెచ్ఎం ఉమామహేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ పొందాలి..

చీపురుపల్లి రూరల్ (గరివిడి): విద్యార్థినులు ఆత్మ రక్షణ కోసం కరాటే, తైక్వాండో వంటి విద్యలో శిక్షణ పొందాలని గరివిడి ఎస్సై బి.లోకేశ్వరరావు అన్నారు. గరివిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు కరాటే, తైక్వాండోలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓలు పి.రామారావు, డి.అప్పన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులకు పోషకాహారం

- పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు చలపతిరావు

వేపాడ: పాడి పశువులకు ఇచ్చే ఆహారంలో ఎక్కువగా పోషక పదార్థాలు ఉండేలా చూసుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు (ఎస్.కోట) డాక్టర్ చలపతిరావు అన్నారు. వావిలపాడులో డాక్టర్ గాయత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పశువుల్లో వచ్చే పునరుత్పత్తి సమస్యల వల్ల దూడల జననం తగ్గిపోతుందన్నారు. ఖనిజ లవణ మిశ్రమాన్ని తగినంత ఇచ్చినప్పుడు చిన్న చిన్న సమస్యలు తగ్గుతాయన్నారు. అలాగే ఈనిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముర్రుపాలు పట్టడం వల్ల కలిగే ప్రయోజనాలు, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



పశువుకు చికిత్స అందిస్తున్న వైద్యాధికారి గాయత్రి

దుకాణాల ఏర్పాటును నిలువరించండి

శృంగవరపుకోట: పట్టణంలోని ఎస్.కోట ప్రధాన రహదారిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వైపు దుకాణాల ఏర్పాటును నిలువరించాలని ఎస్ఎంసీ సభ్యులు, పట్టణ పెద్దలు కోరారు. సోమవారం నిర్వహించిన ఎస్ఎంసీ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. అనంతరం తహసీల్దార్ డి. శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..పాఠశాల ప్రహరీని ఆనుకుని దేశభక్తుల విగ్రహాలు, చిత్రపటాల ఏర్పాటుకు అనువైన వాతావరణం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ జె.నాగేశ్వరరావు, హెచ్ఎం జగదీశ్వరరావు, వేదిక అధ్యక్షుడు సూర్యారావు, వార్డు సభ్యుడు చిప్పాడ శేషగిరిరావు, విశ్రాంత ఉపాధ్యాయులు పీఎం ఆచారి, మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు వై.వెంకటరావు, ఐ.శైలజ, పి.రంగారావు, మహ్మద్ షమీర్, న్యాయవాది బి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న హైస్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు